# జేఎన్‌టీయూ కొత్త విద్యా సంవత్సరం జులై 6 నుంచి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ విద్యా సెనెట్ సమావేశం శుక్రవారం జరిగింది. వీసీ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.కామాక్షిప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, ఇతర అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, పలు విభాగాల డైరెక్టర్లు పాల్గొని కొత్త విద్యా సంవత్సరం క్యాలెండర్, ఫలితాల వెల్లడి తదితర అంశాలపై చర్చించారు.

**ముఖ్యమైన అంశాలివీ..** ● జేఎన్‌టీయూ అనుబంధ, గుర్తింపు పొందిన కళాశాలల్లో కొత్త విద్యా సంవత్సరం(2026-27) జులై 6వ తేదీన ప్రారంభం కానుంది. దీని ప్రకారం ఒక్క మొదటి ఏడాది మినహా 2, 3, 4వ ఏడాది విద్యార్థులందరికి ఒకేరోజు తరగతులు ప్రారంభం కానున్నాయి. ● అలాగే విద్యా సంవత్సరం ముగింపు కూడా వేర్వేరుగా లేకుండా ఈ సారి ఒకే తేదీన ముగిసేలా షెడ్యూల్ తయారుచేయడం గమనార్హం. గతేడాది వరకు ఒక్కో ఏడాది పరీక్షలు వేర్వేరు తేదీల్లో జరిగేవి. ఈ ఏడాది నుంచి మాత్రం నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. ఈ ఏడాది నవంబర్ 27వ తేదీకి మొదటి ఏడాది మినహా 2, 3, 4వ మొదటి సెమిస్టర్ పరీక్షలు పూర్తవుతాయి. ● డిసెంబర్ 7న రెండో సెమిస్టర్ తరగతులు ప్రారంభమవుతాయి. 2027 మే 1వ తేదీన మొదటి ఏడాది మినహా 2, 3, 4వ ఏడాది విద్యార్థుల రెండో సెమిస్టర్ పరీక్షలు పూర్తి చేస్తారు. పరీక్షల అనంతరం 2, 3వ ఏడాది విద్యార్థులు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి శిక్షణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు రెండు నెలల పూర్తి సమయం కేటాయించారు. ● అలాగే గడిచిన 2025-26 విద్యా సంవత్సరంలో కొత్తగా అటానమస్ హోదా పొందిన 11 ఇంజినీరింగ్ కళాశాలలకు అధికారులు ఆమోద ముద్ర వేశారు. గడిచిన విద్యా సంవత్సరంలో తీసుకున్న విద్యాపరమైన మరికొన్ని నిర్ణయాలు, వన్‌టైం ఛాన్స్ వంటి అంశాలకు ఆమోదం తెలిపారు.